# నిర్ణయం

"ఆ ఫుట్‌పాత్ కింద డ్రైనేజి గొట్టాల్లో ఆళ్ల కాపురం. ఆపిల్లనా నువ్వు సేసుకొనేది?" అన్నాడు వీరేశు నాన్న. "సిటీలో ఎంతమందో అట్లనే బతుకుతున్నరు. ఊళ్లో ఆళ్ళకీ యిళ్లున్నయి" అన్నాడు వీరేశు. పెద్ద బ్రిడ్జిలు కట్టడానికి, కొన్ని యిళ్లు కట్టడానికి సిటీకి బాలామణి అమ్మ, అయ్య, వచ్చేసి మూడేళ్లయింది. ఎక్కడ ఏ బ్రిడ్జి, ఫ్లాటుల అంతస్తులు కడుతోంటే, అక్కడికి వచ్చేసి గుడిసెలోనో, డ్రైనేజి గొట్టంలోనో, ఫుట్‌పాత్ మీదనో ఎక్కడో కాపురం. వంటలు, తిళ్లు, బట్టలు, నీళ్లు, పారిశుధ్యం అన్నీ అక్కడే. అట్లాగే బాలామణి, ఆమె తమ్ముళ్లు బతికి పెద్దయినారు. బాలామణి పెద్దదయ్యేటప్పటికి అందాలు విరిశాయి. ఆ చుట్టుపక్కల తిరిగి పళ్లు అమ్ముకునే వీరేశు బాలామణిని మోహించేశాడు. ప్రేమించేశాడు. విరివిగా వస్తున్న పళ్లను అమ్ముకుంటూ సాయంత్రానికి నాలుగైదు వందలు చేతిలో ఆడుతుంటే బాలామణికి కూల్‌డ్రింక్స్, బిస్కట్లు,సమోసాలు కొనిపెడుతూ చేరువైనాడు.

మంచి జీన్సు ప్యాంటు, షర్టులూ వేసుకుంటూ షోగ్గా వున్న వీరేశుని బాలామణి తండ్రి కూడా మెచ్చాడు. వీరేశు నాన్నకి యిష్టం లేకపోయినా దూరంగా వున్న వెంకటేశ్వరస్వామి గుళ్లో పెళ్లిచేసుకున్నారు. అది బాల్య వివాహమే. చట్టవిరుద్ధమే. ఐనా జరిగింది. ఒక బస్తీలో మూడొందలతో ఒక రూము తీసుకుని సంసారం మొదలు పెట్టారు. ఎంత అర్జెంటుగా సంసారం మొదలెట్టారో అంత వేగంగానూ అది ముక్కలైంది. ఇందుకు రెండుకారణాలు. రాత్రి పొద్దుపోయే వరకు వీరేశు యింటికి చేరుకునే వాడు కాదు. ఆ బస్తీలో ప్రతి ఒక్కరు ఏదో ఒకపనికి పోయేవారు. చిన్న పిల్లలు, అనారోగ్యంగా వున్న ఆడవాళ్లు, ఎక్కడా పని దొరక్క తిరుగుతుండే మగపిల్లలూ వుండేవారు. ముక్కు, మొఖం దిద్దుకోవడం, తన అందమైన ముఖాన్ని అద్దంలో చూసుకోవడం, చీరె సవరించి కట్టుకోవడం, జడ పదిసార్లు విప్పి అల్లుకోవడం యివే ప్రధానమైన కాలక్షేపాలు.

వీధి గుమ్మంలోకి వచ్చి నుంచోవడం, పక్కింట్లోకి, ఎదురు గుడిసెల్లోకి ఎవరు వస్తున్నారో, ఎవరు పోతున్నారో చూడడం, రోజూ జరుగుతుండేది. ఎదురింట్లో ఆటో నడిపే అబ్బాయి వున్నాడు. మధ్యాహ్నం పూట ఒక రెండు గంటలు వచ్చేవాడు గుడిసెకి. వండుకునేవాడో ఏమో. తినిపడుకుని మళ్లీ వెళ్లేవాడు. ఆటో రిపేరుకిచ్చి మరి కాస్సేపు యింట్లోనే వుండేవాడు. వయ్యారంగా అందంగా మెరిసే వయస్సులోని బాలామణి గుమ్మంలో నిలబడి కాటుక కళ్లు తిప్పి చూస్తోంటే ఆ అబ్బాయి పులకలెత్తాడు. ఈ చూపులు, ఆ తర్వాత చిరునవ్వులు, పలకరింపులు ఆటో అబ్బాయితోనే కాక యింకా ఒకరిద్దరు వీధిలో మగవాళ్లతో మాటలూ. ఇది

వీరేశుకి నచ్చలేదు. అందమైన పెళ్లాం తన చేయి దాటిపోతోందని అనుమానం ప్రారంభమైంది. ఆమె తల్లి, తండ్రి కట్టడం పనుల్లో ఎటో పోయారు.

ఇదే సమయంలో వీళ్లని వెతుక్కుంటూ వచ్చిన వీరేశు నాన్న పెద్ద ఎర చూపాడు. లక్షరూపాయల కట్నంతో తమ బస్తీలో ఎవరో పిల్లనిస్తామని వస్తున్నారని, ఏకంగా పళ్ల దుకాణం తెరుచుకోవచ్చనీ తాజా వార్త తెచ్చాడు. నువ్వు చేసుకున్నది పెళ్లికాదు ఫో – ఆ పిల్ల చిన్నది,ఎవరేనా కేసు పెడితే చస్తావు బయటపడలేక – అని లేని పోని భయమూ చూపాడు. ఇది రెండో కారణం. ఆ పెళ్లి ముక్కలు కావడానికి.

మెల్లిగా రాత్రిళ్లు యింటికి రావడం మానేశాడు వీరేశు. రాకపోయినా ఫరవాలేని స్థితికి బాలామణి వెళ్లింది. ఇతను ఇటూ పోయాడు, ఆమె అటూ జారిపోయింది. దండిగా డబ్బులు రుచిచూడడం మొదలుపెట్టింది. ఒక కూతురు పుట్టింది..

కొన్నేళ్లు గడిచాయి. ఒకాయన తాళి కట్టాడు బాలామణికి. తన కూతురిని ఏక్టరో, డాక్టరో చేసేయాలని బాలామణికి విపరీతమైన ఆశ. కానీ మధ్య మధ్య తను లాడ్జికి వెళ్లి సంపాదించడం మానలేదు. కూతురికి జీతాలు కట్టాలని, బట్టలు కొనాలని సర్దిచెప్పుకొనేది.

బాలామణికి తాళికట్టిన వాడు ఆమె వృత్తి, వ్యాపకాలను గురించి ముందు నుంచి తెలిసినవాడే కనుక ఆమె ఎటైనా పోయినా పెద్దగా పట్టించుకునేవాడు కాదు. పైగా ఎదురుగా బాలామణి పరువాల కూతురు హేమ కనుపిస్తోంది.

ఒకటిరెండుసార్లు హేమతో సరసాలాడబోతూ అతను కనుపించాడు. భగ్గుమంది బాలామణి. "నీ కూతురి లాంటిది, దానిమీద నీ కన్ను పడిందా?" అని ఉరిమింది. "నా కూతురెందుకైందీ? ఎవడికి కన్నావో, మీ యిళ్లల్లో యివన్నీ మామూలేగా? నేను కాకపోతే ఎవరో ఎగరేసుకుపోతారు, మహా పతివ్రతలా మీరంతా?" అని యీసడించాడు.

మనిషి రక్తం రుచి చూసిన పులిలా కనబడ్డాడు ఆక్షణాన. హేమ చీదరించుకుంది. ఏడిచింది. బాలామణి. సర్దిచెప్పబోయింది. "ఛీ" అన్నది ఆమె కన్నకూతురే. ఆమెకి దూరమై, భ్రష్టమై పోయే పరిస్థితి.

కుతకుత ఉడికిపోతున్న మనస్సుతో దిక్కుతోచని దు:ఖంతో బాలామణి ఆ వీధిలోనే ప్రాక్టీసు చేస్తున్న డాక్టరు దగ్గరికి వెళ్లింది. తన గోడు చెప్పుకుంది. "ఏం చావను? నా పిల్లని పరువుగా పెంచాలని చదివిస్తున్నాను. ఇంత సిటీలో ఎవరు ఎవరి బిడ్డలో తెలియదు గనుక అది పాపం బుద్ధిగా స్కూలుకి వెళ్లి చదువుకుంటోంది. కాలేజీలో చేర్పించాలి. డాక్టరు చదివించాలని దాన్ని బంగారు తల్లిలా పెంచుకొంటే ఈ శనిగాడు దాపురిం చాడు" అని ఏడిచింది.

"నువ్వెందుకు రాత్రిళ్లు పిల్లని వదిలేస్తున్నావు? కాపలా వుండరాదూ?" అన్నది డాక్టరు.

బాలామణి తలవంచుకుంది. అర్థమైంది. "అంటే మీ ఆయన పేరుకే నీ మగడా! నీ పని నీదా?" అన్నది మళ్లీ ఆమె.

"అలవాటైంది. ఆయన యింటి కిరాయి యిస్తాడు. పప్పు, బియ్యం కొని పడేస్తాడు. ఆయనకీ పెళ్లాం బిడ్డలున్నారు కదా. అంతకంటే యివ్వలేడు. అందుకే.." అన్నది బాలామణి.

"అందుకని నీ పాత పద్ధతిలో లాడ్జిలకి పోయి డబ్బులు సంపాదించి తెస్తున్నావు. హేమకి యిది తెలియదా?" అనడిగింది డాక్టరు.

మళ్లీ తలవంచుకుంది బాలామణి. "తెలిసే వుంటుంది.ఎవళ్లో చెప్పరా? మా ఆయనే వాగి వుంటాడు" అన్నది.

"నీ కూతురు అందగత్తె. చదువుకుంది. నీవు చేస్తున్న వృత్తిలోకి దిగడం ఆమెకిష్టమైతే పేచీ వుండదు. బాగానే సంపాదించుకుంటుంది. నానాటికీ యీ వ్యాపారం ఎక్కువవుతోంది. రంగం మారింది. వ్యాపార పద్ధతులు మారాయి. మీ అమ్మ, నాన్న ఎల్లాగూ లేరు. నీకు తాళికట్టాడో లేదో నీకు మగడిలా వుంటున్నాడు యితను. హేమని వదిలేయి. దాని మానాన దాన్ని పోనియ్యి. నీకు తప్పుకానిది ఆమెకు తప్పు ఎల్లా అవుతుంది?" అని విశదంగా సూటిగా వాదించింది డాక్టరు.

బాలామణి కళ్లల్లో నీళ్లుకారిపోతున్నాయి. తను ఎల్లా ఎన్ని మలుపులు తిరిగి ఏ బస్తీలోనో పరువులేకుండా "అది , యిది" అనిపించుకుంటూ బతికింది! అమ్మ, నాన్న ఎందుకు కన్నారో గానీ వీథిలో, ఫుట్‌పాత్ మీద చాపేసుకుని పడుకున్నది. ఏదో పెళ్లి అయింది కదా అనుకుంటే అది పెటాకులైంది. వీరేశుకి నీతి లేకపోయిందా, చిన్నతనంలో డబ్బుకోసం కక్కుర్తిపడి కాలు జారిపోయిన తనకి నీతి లేదా?

ఏది నీతో, ఏది అసహ్యమో ఎవరు చెబుతారు? ఇంత స్పీడుగా నడుస్తున్న లోకంలో ఎవరి గతి ఎవరికి పట్టింది? ఏక్షణానికి ఆక్షణం ఏరాత్రికి ఆరాత్రి, ఏ రోజుకి ఆరోజు తిండి దొరికిందని, సింగారం చేసుకోవడానికి నాలుగురూపాయలు కనుపించాయని సంబరపడింది.

బాలామణి టి.వి. కొనుక్కుంది. ఫ్రిజ్ కొనుక్కుంది. ఎవరో మొగుడన్న వాడి ఆసరాగానే వున్నది. అతని కోసం వండి పెడుతూ పిల్లదానిమీద ఎవరి నీడా పడకుండా బతుకుతోంది. కానీ యిది ఎక్కడి అవాంతరం. కొండ చిలువలా ఆ మగవాడు దాన్ని మింగేయాలని చూస్తున్నాడు కదా!

ఆ పసిపిల్ల వాడికి కొత్త అందాల దోర మామిడి పండులా కనబడుతోంది. వాడి కళ్లు పేలి పోవూ యిల్లా చూస్తున్నందుకు. ఎప్పటికైనా ఆడది ఎంత లోకువ. ఎంత చవక - చీకి పారేసిన మామిడి టెంక ఆడది.

"ఏమిటమ్మా ఆలోచన.. నేను చెబుతాను విను. నీ పిల్ల నీలాగా కాకుండా వుండాలంటే నువ్వు చిల్లర సంపాదన మానేయాలి. నీ మొగుడన్న ఆ మనిషికి కనబడకుండా పోవాలి. హేమ కూడా నిన్ను అసహ్యించుకునే తెలివి తెచ్చుకునే దాకా ఆగకు.

"ఇప్పుడు నువ్వు ఆలోచించుకో. నువ్వు యిల్లుమారిపో. ఎక్కడికైనా దూరం వెళ్లు. హేమ స్కూలు అయిపోయింది కదా. కాలేజీలో కొత్త చోట చేర్చవచ్చును" అన్నది గట్టిగా డాక్టరు.

"నేను-నేను ఏం చెయ్యను?" బాలామణి అస్పష్టమైన ఆవేదన.

"బజ్జీల దుకాణం పెట్టు. ఒక ఐదు వందల రూపాయలు పెడితే మూకుడు, పెద్దసైజు గరిటె వస్తాయి. బజ్జీలు చేసి అమ్ము. రోజుకో వంద కూడా మిగలవచ్చు."

బతుకు గురించి నిర్ణయం - తనని గురించి కాదు. వికసిస్తున్న ఆ మొగ్గ గురించి నిర్ణయం తుంచి పారేస్తుందా? నలిపి నాశనం చేస్తుందా?

పది రోజులకి రాత్రికి రాత్రే సామాను బండిలో వేసుకుని బాలామణి వున్న బస్తీలోంచి ప్రయాణిస్తోంది హేమ జీవితం కోసం ఆమె తీసుకున్న బంగారు నిర్ణయం అది. వృత్తిలోంచి బయటికి వచ్చి, బురదలోంచి పైకి లేచి బతకడానికి స్థిర నిశ్చయం అది.

హేమ మీది ప్రేమతో, బాలామణి తన పాత బతుకుని... ఆ మురికి గదిలో వదిలేసింది.

**వాస్తవ గాథ**